అప్రజ్ఞాతం

ముందు ముందు ఎందరి దృష్టినో ఆకర్షించే సంఘటనైనా జరిగేటప్పుడు దాని ప్రాధాన్యతను గ్రహించలేము. అతి సామాన్యంగా జరిగిపోతుంది. ఆనాడు జగన్నాథస్వామి ఆలయంలో జరిగిన సంఘటన కూడా అలాంటి వాటిలో ఒకటి.

సుదర్శనం యువకుడు. పట్నంలో బి.ఎ. పరీక్షకు కూర్చున్నాడు. ఫలితాల కోసం ఎదురుచూస్తూ స్వగ్రామంలో ఉన్నాడు. వయసు మిగిలాక చదువులో ప్రవేశించడం వల్ల విద్యార్థే అయినా విద్యార్థిలా కనిపించడు.

ఆ ఉదయం కాలక్షేపం కోసమే అతడు ఆలయానికి వెళ్ళాడు. అప్పటికే కొందరక్కడచేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంత సేపటికవి రాజకీయాల మీదకీ నడిచాయి.

రాజకీయాలు చర్చించటమంటే పార్టీలనూ ప్రభుత్వాలనూ తత్సంబంధీకులనూ దుమ్మెత్తి పోయటమే. పట్టణాల్లో అయినా పల్లెల్లో అయినా రాజకీయ చర్చలు రాజకీయ చర్చలే.

ఆసరికి కాంగ్రెస్‌ను తూర్పార బట్టడం జరిగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోసేశారు. నెహ్రూ చేతకానితనం గూర్చి వాపోవడం ముగిసింది. కథ కమ్యూనిస్టుల మీదికి మళ్ళింది. కమ్యూనిజం యొక్క అమానుషత్వం గురించి చర్చ సాగుతోంది.

పట్టణాల్లో చదువుకున్న వాళ్ళలోనే యిలాంటి తెలిసీ తెలియని వాళ్ళు చాలా మందుంటారు. అలాంటి వాళ్ళను చూస్తే సుదర్శనానికి ఒళ్ళు మంట. అయితే – మరీ భరించలేనప్పుడు తప్ప వాళ్ళను ప్రతిఘటించడు.

పార్టీలో మెంబర్‌షిప్ లేకపోయినా సుదర్శనానికి ఆ పార్టీ పట్ల సానుభూతి ఉంది. కమ్యూనిస్టులను విమర్శించినా అతడు సహించగలడు గాని వాళ్ళ సిద్ధాంతం తప్పుడు సిద్ధాంతమంటే అతడు తట్టుకోలేడు.

ఆరోజు అక్కడ చేరిన వాళ్ళలో ఎవరు ఏం వాగినా అతడు ఖాతరు చేయకపోను. బుచ్చిలింగం కూడా వాళ్ళతో గొంతు కలుపుతుంటే అతడు ఓర్చుకోలేక పోయాడు.

బుచ్చిలింగం పరిస్థితులు ఒకప్పుడు బాగానే ఉండేవి. ఆపదలకూ ఆడపిల్లల పెళ్ళిళ్ళలకూ అప్పులుచేసి వడ్డీలతోనూ వడ్డీలకు వడ్డీలతోనూ కోర్టు ఖర్చులతోనూ అవి పెరిగిపోగా భూమీ పుట్రా సమస్తం పోయి ఇప్పుడు తిండికి కూడా కష్టపడుతున్నాడు.

అందుకని–

"నీకు కమ్యూనిజాన్ని గురించి ఏం తెలుసని దానిని విమర్శిస్తా వయ్యా?" అన్నాడు వీలైనంత సౌమ్యంగానే.

బుచ్చిలింగం వయసున చాలా పెద్దవాడైనా పల్లెటూరి సాంప్రదాయాల ననుసరించి ఏకవచన ప్రయోగం సభ్యతా దూరం కాదు.

సుదర్శనం సవాలు అందరి దృష్టినీ ఆకర్షించింది.

కొంత గొడవ తరువాత కమ్యూనిజం గురించి అతడు చెప్పడానికీ తక్కిన వాళ్ళు వినడానికీ అంగీకారం కుదిరింది.

పార్టీ రాజకీయాల మీద చర్చ వెనక్కి వాయిదా వేసి సిద్ధాంతం ఎందుకు పుట్టిందో అదేమంటుందో ముందు చెపుతానన్నాడు సుదర్శనం. అతడేం చెప్పినా దానిని ఖండించడమే వాళ్ళ లక్ష్యం కాబట్టి – సరే! అదే చెప్పు– అన్నారు.

ఈ దేశంలోనే కాక దాదాపు అన్ని దేశాల్లోనూ తినడానికి ఉన్న వాళ్ళు తక్కువా తిండి లేని వాళ్ళే చాలా చాలా ఎక్కువ! ఈ పరిస్థితి ఎలా వచ్చిందో చెప్పి – పెట్టుబడి, పెట్టుబడిదారీ ఉత్పత్తి, మిగులుశ్రమ వంటి పారిభాషిక పదాలను వివరిస్తూ పట్టణాల్లో పెద్దపెట్టున సాగే పారిశ్రామిక దోపిడీ గురించి క్లుప్తంగా చెప్పి పల్లెల్లో సాగే భూస్వామ్య దోపిడీ గురించి చెపుతున్నాడు. ఇంతలో అక్కడకు సూరప్పడు వచ్చాడు.

అతడు రాగానే అక్కడున్న వాళ్ళంతా – ఏం అన్నా! ఏం బావా! ఏం దద్దీ! ఏవండీ! అంటూ వరసగా పలకరింపుల్లో పడ్డారు. అతడు అందరికీ అన్ని వరసల్లోనూ జవాబిచ్చి 'మీరేదో మాటాడుకుంటున్నారు కావాల! మాటాడుకోండి. మాటాడుకోండి' అంటూ ఆలయం లోపలికి వెళ్ళి పోయాడు. సుదర్శనం ఆపినచోట ఎత్తుకొని ముందుకు పోతున్నాడు.

ఆ ఊళ్ళో సంపన్నులందర్లోకీ సంపన్నుడు సూరప్పడు. మనిషి మాత్రం అలా కనిపించడు.

ముతక ఖద్దరు గావంచా ఒకటి కట్టుకొని పై మీద ఒక తువాలుతో అప్పుడప్పుడే పైబడుతున్న ముసలి రూపుతో తల వంచుకొని తన పనుల మీద తిరుగుతుంటాడు. మనిషెంత నిరాడంబరుడో మాటంత మృదువు. పని పడితే తప్ప పలకరింపులకు మించి మాటాడడు.

అతడు భగవంతుణ్ణి నమ్ముతాడు. పాపమంటే భయం. పుణ్యకార్యాల పట్ల ఆసక్తీ ఉన్నవాడు. ఆవాళ శనివారమని కాబోలు – పొత్తిగావంచా కట్టుకొని, చేతిలో పూజా ద్రవ్యాల పళ్ళెం పట్టుకొని, భుజాన తడి అంగ వస్త్రంతో, నుదట తిరునామాలతో దేవాలయంకొచ్చాడు. ఆలయంలో అర్చకులు కనిపించకపోగా ప్రాకారంలోనే ఉన్న ఆయన యింటికి వెళ్ళాడు. అక్కడ నుండి వచ్చాక సావిడిలో సాగుతున్న గోష్ఠి వింటున్నాడు.

సుదర్శనం ఆసరికి భూస్వామ్యంలో జరిగే దోపిడీ గురించి చెప్పటం దాదాపు పూర్తయ్యింది. ఒకటి రెండు విషయాలు మిగిలిపోతే అడ్డు ప్రశ్నలు వేసే వాళ్ళతో 'ఆగండి ఆగండి' అంటూ పూర్తి చేస్తున్నాడు.

అక్కడున్న వాళ్ళలో ఎవ్వరూ సుదర్శనం పాటి చదువుకున్న వాళ్ళు కారు. అయినా, ఆమాటకొస్తే అందుచేతే, సుదర్శనాన్ని ఓడగొట్టాలని వాళ్ళకు గట్టి పట్టుదలగా ఉంది.

సుదర్శనం చెప్పేది పారిభాషిక పదాలకూ పారిశ్రామిక దోపిడీకి పరిమితమై సాగినంతసేపూ వాళ్ళకు లంగరు అందలేదు. ఎంత శ్రద్ధగా విన్నా ప్రత్యుక్తులు దొరకలేదు. పల్లెలో సాగే దోపిడీ గురించి చెపుతుంటే మాటమాటకీ వాళ్ళకి ప్రత్యుక్తులు కనిపిస్తున్నాయి. చాలాసార్లు అతన్ని అడ్డు తగలబోయారు. మధ్యలో మాటాడడానికి సుదర్శనం అవకాశం ఇవ్వక పోవడంతో వాళ్ళెలాగో ఓపిక పట్టారు. సుదర్శనం ఆఖరు విషయం కూడా చెప్పేసి ఆగిపోయాక బుచ్చిలింగమే ముందుకు వస్తూ అడిగాడు.

"అయ్యిందా? ఇప్పుడు నే అడగొచ్చా?" అన్నాడు తల తాటిస్తూ–

అడగొచ్చన్నాడు సుదర్శనం.

"ఇప్పుడు మీ నాన్నగారే ఉన్నారు. ఆయనా వ్యవసాయం చేయిస్తు న్నారు. చేయించింది మరీ పెద్ద వ్యవసాయం కాకపోవచ్చు. కాని, ఇందాక నువ్వన్నావే! పెద్ద పెద్ద భూస్వాములని, ఆళ్ళలాగే యీయనా పొలంలోకి దిగడు. కాళ్ళకీ చేతులకీ బురదవదు. పాలేళ్ళూ కూలేళ్ళూ కంబార్లూ కూలీలే పంటలు పండించి గింజలు ఇంట్లో పోస్తారు. అయితే ఆయనా వాళ్ళ శ్రమను దోచుకుంటున్నట్టేనా?"

సుదర్శనం శాంతంగా జవాబిచ్చాడు.

"అవును. ఆయనా ఓ తరహా భూస్వామే. ఆయన చేసేదీ దోపిడీయే. సరిపోయిందా?" అని–

"నేను చెపుతున్నది – నేనూ మా నాన్నగారూ కష్టార్జితంతో బతుకుతున్నామనీ తక్కిన వాళ్ళంతా దోపిడీచేసి బతుకుతున్నారనీ కాదు. పెట్టుబడిదారీ విధానంలో దోపిడీ ఉంది. ఆ దోపిడీ వల్ల రెక్కలు ముక్కలు చేసుకునే వాళ్ళకు దక్కేది తక్కువనీ దాదాపు సంపదంతా దోచుకునే వాళ్ళకే దక్కుతోందనీ చెపుతున్నారు. తెలిసిందా?" అన్నాడు సుదర్శనం.

సుదర్శనం మాట శాంతంగానే వున్నా అతని మోహంలో ఆవేశం కనిపిస్తోంది. వాళ్ళందరూ అతడికన్నా వయసులో పెద్దవాళ్ళు; కుర్రవాడి మొహంలో ఆవేశం చూసేసరికి ఒకళ్ళిద్దర్లో చిలిపితనం కూడా తలెత్తి నట్టుంది. ఒక్కొక్కరే అడ్డు సవాళ్ళు విసురుతున్నారు.

"అది కాదయ్యా! పాలేర్ల చేతా కూలీలచేతా పని చేయించుకుంటే వాళ్ళకు జీతమో కూలో ఇస్తున్నాం కదా! అందులో దోపిడీ ఎక్కడుందీ" నారాయణయ్య అడిగాడు.

"తగిన జీతం, తగిన కూలి యియ్యటం లేదు. వాళ్ళకు రెండు రూపాయలు ముట్టవలసిన చోట రూపాయ ముడుతోంది."

"రెండు రూపాయలివ్వ వలసిన చోట రూపాయి యిస్తే వాళ్ళెందు కొస్తారూ?"

సుదర్శనం క్షణకాలం నిరుత్తరుడై పోయాడు ఉత్తరం లేక కాదు. తోచక కాదు. ఇంతసేపూ చెప్పింది వాళ్ళకు బోధపడలేదా? లేక వాదనే వాళ్ళకు ముఖ్యమా!" – అని ఆలోచిస్తున్నాడు. ఈ రెండిటిలో ఏదైనా అతడు కొనసాగించి ప్రయోజనం లేదు.

"చెప్పు. రెండు రూపాయలు ముట్టవలసిన చోట రూపాయే ముడితే వాళ్ళెందుకొస్తారు?" నారాయణయ్య రైతు. అతనడుగుతున్నాడు.

"అంటే కథ మళ్ళా మొదటికొచ్చిందన్న మాట!" అన్నాడు సుదర్శనం.

దానిమీద – అంతవరకూ గుంభనంగా ఉండిపోయిన బైరాగి జోక్యం చేసుకున్నాడు.

బైరాగి ముప్పై నలభై ఎకరాల పెద్దరైతు. తరతరాలుగా వాళ్ళది రైతు కుటుంబం. పంతులు రైతుల్నేదో అంటున్నాడనే కాదు – అసలిలాటి ఊహలు మనుష్యులకి పుట్టడమే తప్పు. దానికి సాయం పదిమంది మధ్యా పెట్టి ప్రచారమొకటా అంచేత అతడు అడ్డు తగులుకున్నాడు.

"కథ మొదటికొచ్చిందో చివరికొచ్చిందో నాకైతే తెలీదుగాని– నీకు తెలివి ఎక్కువై పోయింది" అన్నాడు మొదటగా.

"అంటే!"

"అతి తెలివైపోయింది".

సుదర్శనం అప్పటికేనా ఆగొచ్చు –కాని ఆగలేదు.

"ఎవరికి?" అన్నాడు కొంచెం తీవ్రంగా.

"నీకే–" అంటూ చప్న లేచి నించొని గొంతు పెంచేస్తూ మాట మాటకీ అభినయం చేస్తూ అందుకున్నాడు.

"– కాకపోతే యేటండీ! మిల్లుల్లో పనిచేసే వాళ్ళకి ఇల్లిస్తారంటావు. రేషన్లిస్తారంటావు. మందూ మాకూ చూస్తారంటావు. పిల్లలకు బళ్ళు పెడతారంటావు. ఇన్నీ ఇచ్చి జీతాలు కూడా ఇస్తుంటే మిల్లు యజమాను లది దోపిడీ అంటావు. కూడెట్టి, గుడ్డలెట్టి, పైగా జీతమిచ్చి పాలేళ్ళను పెట్టుకుంటే దోపిడీ అంటావు?"

"దోపిడీ యేటయ్యా దోపిడి! నోటికి సుద్దీ బద్దీ ఉండాల!" అంటూ చప్పున కూర్చుండిపోయి గొంతు తగ్గించేస్తూ–

"ఇదుగో! ఎవరి సొమ్మైనా రాత్రికి రాత్రి కొట్టేసుకొస్తే

అది దోపిడీ?" అని, స్వరం మళ్ళా పైకొదిలేస్తూ మనిషి కూడా లేచిపోయి–

"తాగడానికి గంజి లేకపోయినా పిల్లల్ని మాత్రం కనేసి అడుక్కు తినండిరా కొడకల్లారా అని అమ్మా బాబూ ఒదిలేస్తే చేరదీసి గంజిపోసి బతుకు పెడితే పెట్టినోడిది పాపమా? ఆడు దోపిడీదారా?" అని యీసడిస్తూ సుదర్శనాన్ని చూసి – ఆ తరవాత తక్కిన వాళ్ళవంక తిరిగి పోతూ.

"ఆడెవడో ఎక్కడోడో – ఎప్పుడో ఏదో రాసినాట్ట. అది తీసుకొచ్చి యీ పంతులిక్కడ అప్పగిస్తున్నాడు!" అని మళ్ళా చప్పున కూర్చుండిపోయి సుదర్శనం మీదకి ఒంగిపోతూ–

"అయితే, నువ్వన్నదీ మాటే! ఇక్కడా దోపిడీ జరుగుతున్నది. నిజమే. కూలోళ్ళని భూములున్నోళ్ళు దోచుకోవడం కాదు. భూమున్నోణ్ణి కూలోడు దోచుకుంటున్నాడు, ఎలాగంటావా? ఇప్పుడొక కంబారున్నాడు. ఎవడిదాకో ఎందుకు – మా ఆశిరయ్యే ఉన్నాడు, లోకమందరితో పాటు ఏడాదికిన్ని పుట్లని నేనూ ఆడికి గింజలు కొలుస్తాను. పంట పంటకీ పొల్లాయిలు పట్టుకుపోతాడు ఏటాజత పంచలు పెడతాను. పాత బనీన్లనీ చొక్కాలనీ తువ్వాళ్ళనీ దుప్పటి గుడ్డలనీ ఆడికేం అవుసరమైతే అది అడిగి పట్టుకుపోతాడు. ఇంతచేసినా ఆడికి విశ్వాసముందా? కాస్త కనుమలిగితే చాలు. కోసిన చేల్లోంచి ఓవుకి పిడికిడేసి పోగేసి మోపో, రెండు మోపులో రాత్రికి రాత్రి తర్లించేస్తాడు. అలాగ చేసినందుకు ఆడిని ఎన్నిసార్లు తన్నానో యీ నారాయణయ్య నడుగు.

అదిగలా మా కంబారొక్కడే కాదు. అలాగ వరి పంట లొక్కటే కాదు.

ఊళ్ళో ప్రతి కంబారీ ప్రతి కూలోడూ ఎప్పుడో ఒకప్పుడు దేనికో ఒకదానికి – అది గింజ కావచ్చు. కాయ కావచ్చు. కర్ర కావచ్చు, చొప్ప కావచ్చు – రైతు మొహం చాటైతే శాన కక్కుర్తి పడినోడే. అలా పడనోడు ఎవడేనా ఉంటే తీసుకురా – నా చెవి కదపాయిస్తాను".

అంటూ లేచిపోయి,

"అవునండీ దోచుకోడం మాటకొస్తే ఉన్నోడిని లేనోడు దోచుకోవాల. రైతు పాలేరునీ దోచుకోడవేటీ సబువు తక్కువమాట!" అంటూ ముగించాడు.

అతని వాదన అందరికీ అర్థమయ్యింది. దానికింక జవాబు లేదనుకున్నారు కూడా. సుదర్శనం మాత్రం అలా అనుకోలేదు. అందుచేత–

"నువ్వలా భరతనాట్యం చేస్తే నేను చెప్పలేను. కూర్చుని మాటాడితే జవాబివ్వగలను" అన్నాడు.

"సరే చెప్పు" అంటూ బైరాగి కూర్చుండిపోయాడు.

"నువ్వు దోపిడీని దొంగతనాన్నీ ఒక్కటే అనుకుంటున్నావు. దొంగతన మంటే నువ్విందాక చెప్పినట్టు ఎవరూ చూడకండా ఎవరికీ తెలియకండా కాటేసుకు పోవడం. దోపిడీ అనేది వేరు. పట్టపగలు అందరూ చూస్తుండ గానే భుజబలంతోనో ఆయుధ బలంతోనో, సంఘ బలంతోనో ప్రతిఘటించడానికి అసమర్థుణ్ని చేసి దౌర్జన్యంగా ధనాన్నో బంగారాన్నో లేక యింకొక సంపదనో స్వంతదారునిచేతే తెప్పించి పుచ్చుకొని మహా రాజులా తీసుకుపోతే – అదీ దోపిడి"

తన నిర్వచనానికి తిరుగు లేదన్నంత ధీమాగా చెప్పేడు సుదర్శనం.

కాని బైరాగి అడిగాడు.

"సరే. దోపిడి అంటే అదే అనుకుందాం. ఎలాగైనా నువ్వు నాకన్నా ఎక్కువ చదివినోడివి కదా! అయితే పాలేరోళ్ళ మీదపడి దుడ్డుకర్రల్తో బెదిరించి రైతులు ఆళ్ళ యిళ్ళల్లో ఉన్న కుండబొచ్చెలూ చింకిపాతలూ లాక్కుంటున్నారంటావా?"

విన్న వాళ్ళకీ ప్రశ్న కితకితలు పెట్టింది. సుదర్శనానికి ఆ మాటలో చురుకు తగిలింది.

"కాదు, అంతకన్నా ఎక్కువే దోచుకుంటున్నారు. దుడ్డుకర్రను చూపి కాదు, ఆకలి రాక్షసి కోరలను చూపి. నువ్వు పేదవారని వెక్కిరించే పాలేర్ల వద్దా, కూలీల వద్దా అమూల్యమైన శక్తి ఒకటి ఉంది. ఆ శక్తే మట్టిలోంచి మనకందరికీ కావలసిన తిండి గింజలు పుట్టిస్తుంది. ఆ శక్తే కలపలోంచీ ఖనిజంలోంచీ మనమందరం వాడుకునే సమస్త వస్తువులనీ తయారు చేస్తుంది. ప్రతి ఉదయం వాళ్ళు నిద్రలేచేసరికి చలమలో నీరూరినట్టు వాళ్ళ నరాల్లో యీ శక్తి నిండి ఉంటుంది. అది తప్ప వాళ్ళ దగ్గర యింకేమీ వుండదు. దానిని అమ్ముకొని తప్ప వాళ్ళు ఇంకోలా బతకలేరు. మీకూ ఆ ఫ్యాక్టరీ యజమానులకూ కావలసింది అతి విలువైన ఆ శ్రమ శక్తే.

ఏ పూట ఆ శక్తి అమ్ముడుపోకపోతే ఆ పూట వాళ్ళకు తిండి వుండదు. ఆకలి రాక్షసి పేగులు నమిలేస్తుంది. వరసగా కొన్నాళ్ళు తిండి లేకపోతే మాడి చస్తారు.

వాళ్ళు అలాంటి నిరుపాయ స్థితిలో వుండగా ఆ స్థితిని ఆసరా చేసుకుని ఇక్కడ మీరైనా, అక్కడ ఫ్యాక్టరీ వారైనా వాళ్ళ శ్రమశక్తిని బేరమాడతారు.

అన్న రేటుకి సరుకు దొరకకపోతే కొంతకాలం దాకా అయినా మీరు ఆగగలరు.

ఏదో ఒక రేటుకి ప్రతిరోజూ వాళ్ళ శ్రమ అమ్ముడుపోకపోతే ఒక్క రోజైనా వాళ్ళు బ్రతకలేరు.

అందుకూ – హీన క్రయానికైనా వాళ్ళు శ్రమశక్తిని అమ్ముకుంటారు.

"మీ కొనుగోలులో వాళ్ళ అమ్మకంలో బలప్రయోగం ఉందో లేదో మీరే ఆలోచించండి" అంటూ ఆగి వెంటనే మళ్ళా చెప్పసాగాడు.

"మీరేకాదు బాగా చదువుకున్న వాళ్ళు కూడా ఒక ప్రశ్న వేస్తుంటారు. జీతాలు చాలనివాళ్ళు ఆ ఉద్యోగాల్లో చేరడమెందుకు? తరవాత సమ్మెలు చేయడమెందుకు అంటారు.

బంగారమో వాడుకుంటున్న సైకిలో ప్రాణావసరం పడ్డప్పుడు అమ్ముకునే అనుభవం అందరూ ఎరిగినదే. వస్తువుకి సగం విలువకట్టి మీ కిష్టమైతే అమ్మండి లేకపోతే యింకొక చోటికి వెళ్ళండి – అనగలడు కొనేవాడు. కొనడం అతనికి ప్రాణావసరం కాదు. అమ్మడం నీకు ప్రాణావసరం కాబట్టే నువ్వు హీనక్రయానికి అమ్ముకుంటావు.

హీన క్రయంలో వేదన ఏమిటో అమ్ముకునే వాడికే తెలుస్తుంది".

"తెలిసింది కదా. పల్లెటూళ్ళలో ఇళ్ళూ పొలాలూ అమ్మకాలన్నీ హీన క్రయానికే జరుగుతాయి". కొంతసేపు ఊరుకొని బైరాగి అన్నాడు.

''సరే నువ్వన్నట్టు దోపిడీ జరుగుతోందని ఒప్పుకుంటాము. దోచిన దొంగమాలు ఎక్కడో ఒక దగ్గిర ఉండాలి కదా. మిల్లులు పెట్టి దోచినోళ్ళ దొంగమాలు వాళ్ళ మేడల్లోనూ కార్లలోనూ కనపడుతుంది. ఆళ్ళతో సమానంగా రైతులం – మేమూ దోస్తన్నాం అంటావు–"

"నేనలా అనలేదు".

"పోనీ మేం చిన్న దోపిడిగాళ్ళం. అయినప్పుడు తక్కువో ఎక్కువో దొంగమాలు మా దగ్గిర కూడా దొరకాలి కదా? ఏదీ ఏ రైతు మేడలూ మిద్దెలూ కట్టేసేడో ఏ రైతు పది కూరలతో పరమాన్నాలు తినేస్తున్నాడో చూపించమీ?"

సుదర్శనం దీనికి కూడా జవాబిచ్చాడు.

"దొంగామాలు మీ దగ్గిరా కనిపించును. కానీ కూలీలు రైతుల చేతుల్లో అన్యాయమై పోతున్నట్టే, రైతులు, వ్యాపారులూ షాహుకార్ల చేతుల్లో అన్యాయమై పోతున్నారు".

ఆ మాట వినగానే అక్కడున్న ఒక షాహుకారు బిడ్డ –

"ఇక సరి రా!" అన్నాడు యీసడిస్తున్నట్టు.

అతడన్న మాటకన్నా ఆ మాట తీరుకి అందరికీ నవ్వొచ్చింది.

బైరాగి జేబులు తడుముకుంటూ లేచిపోయి తొందర తొందరగా చుట్టా అగ్గిపెట్టీ వెతికితీస్తూ–

"అయ్యా రైతులం మా పని అయిపోయింది. ఇంక వ్యాపారులూ షాహుకారులూ వంతొచ్చింది. మీరూ మీరూ చూసుకోండి" అన్నాడు చుట్ట నోట్లో బిగిస్తూ.

దానిమీద అంతా గొల్లుమన్నారు.

తనింత చెప్పాక కూడా ఒక్కమాటతో మొత్తం తన వాదాన్ని అభాసు పాలు చెయ్యగలిగిన బైరాగిని సుదర్శనం మెచ్చుకోవాలి. కాని మెచ్చుకోలేక పోయాడు. తను ఓడటం తనకు కష్టమే అయినా అతడు సహించగలడు. నమ్మిన సత్యం అభాసుపాలవడం అతనికి చాలా బాధగా ఉంది.

అక్కడ–

చిదిగిపోయిన బుచ్చిలింగం, చిన్నరైతు నారాయణయ్య, పెద్ద రైతు బైరాగే కాక ఇద్దరు షాహుకారి బిడ్డలూ, అందర్నీ మించి పెద్ద షాహుకారు సూరప్పడూ ఉన్నారు. తన వాదన ఇంతమందినీ నొప్పించేదే అయినా అతడు విడవదలచుకోలేదు. ఓడినకొద్దీ పంతం పెరుగుతోంది.

షాహుకార్లూ వ్యాపారులూ చేసే అన్యాయాల మీద కొన్ని చిన్న చిన్న ప్రశ్నలూ చిలిపి ప్రశ్నలూ వేసి షాహుకారి బిడ్డలు అతణ్ణి రెచ్చగొట్ట బోయారు. అంతమాత్రాన అతడు రెచ్చిపోలేదు.

"మీకు నిజం తెలుసుకోవాలన్న కోరిక ఉంటేనే, నిజం వినగల ధైర్యం ఉంటేనే ప్రశ్నలడగండి. చెపుతాను. నవ్వుతాలుగా ప్రశ్నలు వేసి నిజాల్ని అబద్ధాల్లా చూపించటానికి ప్రయత్నిస్తే మాటాడను" అన్నాడు సుదర్శనం.

షాహుకారు బిడ్డలు – నవ్వుతాలు కాదు చెప్పు చెప్పు – అన్నారు. రైతులకి దొరకని సుదర్శనం తమకి దొరకవచ్చనే ఆశ వాళ్ళకేమూలో ఉంది. ఇంతలో బైరాగి కల్పించుకొని

"అలాక్కాదు. ఇందాక దొంగమాలనుకున్నాం కదా – రైతుల దగ్గరిది చేతులు మారిపోయిందన్నావు. అదెలాగో చెప్పు" అని –

"ఏం దద్దా!" అన్నాడు సూరప్పడితో.

సూరప్పడు మాటాడలేదు. నవ్వు ముఖంతో తల ఊగిస్తూ ఊరుకున్నాడు.

బుచ్చిలింగంకేసి తిరిగి బైరాగి కన్ను గిలపడం, సూరప్పణ్ణి ఇందులోకి లాగి తన్ను చెదరగొట్ట బోవడం సుదర్శనానికి ఒళ్ళు మండించాయి.

"ఆయన్ని ముందుకు నెడుతున్నావు. కాబట్టి ఆయన చెప్పమంటేనే చెపుతాను" అన్నాడు ఆకాడికీ.

''చెప్పు చెప్పు'' అన్నాడు సూరప్పడు దూరం ఆలోచించకుండానే.

''ఉదాహరణకి మిమ్మల్నే తీసుకోండి'' అన్నాడు సుదర్శనం.

సూరప్పడు కూడా అనుకున్న దానికన్నా తల ఎక్కువగా ఊపుతూ–

"ఆఁ.. ఆఁ" అన్నాడు వింటున్నట్టు.

"మీరు తల కట్టేసరికి నిజంగా మీ దగ్గర ఉండినదెంత? నాలుగు వేలు ఐదు వేలు మహా అయితే పదివేలు.

ఈనాడెంత? లక్ష దాటిందా? అందరూ అనుకునే అంకే నేను చెబుతున్నాను. ఈ తొంభైవేలూ మీకు ఎలా వచ్చాయి?"

సుదర్శనం సాహసానికి తక్కినవాళ్ళు నిచ్చరపోతున్నారు.

సూరప్పుడు మాత్రం తల ముందుకీ వెనక్కీ అలా ఊపుతూనే తడబడే మాటలతో అన్నాడు.

"లక్షా! లక్షా! లక్షే? ఎక్కడిదీ? సరే లక్షే అను! లక్షో పది లక్షలో అయితే ఎలా వచ్చిందంటావు? అదీ నువ్వే చెప్పు"

సుదర్శనం రెట్టిస్తూ అన్నాడు.

"మీరు చెప్పండి".

"దేవుడిచ్చాడు. ఎవరికైనా ఎలాగొస్తుంది? దేవుడిస్తాడు. ఏమయ్యా నారాయణయ్యా - ఏమంటావు? దేవుడిచ్చాడు. ఆ జగన్నాథుడిచ్చాడు".

ఉడుకు రక్తపు సుదర్శనానికి దేవుడి ప్రసక్తి వినగానే పుండుమీద కారం చల్లినట్టయ్యింది.

''దేవుడిచ్చాడా?'' అని, చేతకాని అయ్యవారు మొద్దబ్బాయిని యీసడించినట్టు -

"ఒక ఉదయమో ఒక సాయంకాలమో చల్లని వేళ చూసుకొని ఆ తొంభై వేలూ సంచిలో వేసుకొచ్చి మిమ్మల్ని అందుకోమన్నాడా?" అనేశాడు. తొందర తొందరగా అన్నాడే గాని హద్దుమీరి మాటాడినందుకు బాధగా మొహం పక్కకు తిప్పేశాడు.

"లేకపోతే మరెలా వచ్చింది? ఎలా వచ్చిందో చెప్పండి" అన్నారు. సూరప్పుడు. మొహం మీద నవ్వుని నిలబెట్టుకోవడం కష్టంగా ఉంది ఆ ప్రాణికి. తల మాత్రం అలా ఊగుతూనే ఉంది.

"ఎలా వచ్చిందా?... వడ్డీల వల్ల వచ్చింది. వర్తకం వల్ల పోగయ్యింది. ఈ రెండూ అన్యాయాలెలాగయ్యాయని మీరడగక్కర లేదు. నేనే చెపుతాను.

ఒక సామాన్య రైతుకి ఏటా కావలసే వ్యవసాయపు మదుపు నాలుగైదు వందలు. భార్య వంటిని ఆ విలువకు మించిన బంగారం ఉంటుంది. అది తియ్యడు. పాతిక సెంట్ల పొలమమ్మినా ఆ మదుపు చేతికొస్తుంది. ఆ పనీ చెయ్యడు. ఈ రెంటిలో ఏది చేసినా అతడు మీ దగ్గరికి రానక్కరలేదు. తిప్పి తిప్పి దాన్నే వాడవచ్చు. కాని అలా జరగదు.

ఏటా మదుపు కోసం మీ దగ్గర కొస్తాడు. అదే కాదు ఏ అవసరం వచ్చినా అప్పుచేసే ఆ అవసరం తీర్చుకొంటాడు. అదీ ఒక్కసారి చెయ్యడు. దఫదఫాలుగా చేస్తాడు. ఆ అప్పులన్నింటి మీదా వడ్డీలు కట్టి వసూలు చేస్తారు.

రూపాయకి కానీ (రూపాయిలో అరవై నాల్గోవంతు) వడ్డీ చాలా తక్కువలా కనిపిస్తుంది. మీ లెక్కలు సంవత్సరాంతానికి గాని తేల్చరు. అప్పుడు రైతు పుచ్చుకునే ప్రతి రూపాయికీ మూడణాలు (3/16 రూ.) వడ్డీ అవుతుంది. రూపాయిలో ఇంచుమించు ఐదోవంతు. ఏడాది మొత్తం మీద ఐదు వందలు తీసుకుంటే ఏటి చివరికి అసలు వృద్ధులు ఆరు వందలు. అంటే మీకా రైతు నుండి ఒక్క వడ్డీవల్లే వంద రూపాయలు లాభం.

కాగా - మీ కాసుల వడ్డీలో ఎంతెంత తికమకలున్నాయో వింటే మీరు విస్తుపోతారు.

సంవత్సరం మొదటి రోజున అప్పిచ్చిన డబ్బుకి ఎంత వడ్డీ లెక్క వేస్తారో ఆఖరు రోజున ఇచ్చిందానికి కూడా అంతే వడ్డీ లెక్కవేస్తారు. ఉదాహరణకు మీ రైతొకడు సంవత్సరం ఆఖరు రోజున నూరు రూపాయలు తీసుకున్నాడనుకోండి. రూపాయికి మూడణాల వంతున నూటికి సరాసరి పందొమ్మిది రూపాయల వడ్డీ. కాలం ఒక్కదినమే. అంటే నూటికి సంవత్సరానికి ఇంచుమించు ఆరువేల తొమ్మిది వందలు వడ్డీరేటు అవుతుంది. (కరెక్టుగా కావలిస్తే రూ. 6843.75 శాతం)"

షాహుకారు బిడ్డలిద్దర్లో ఒకడు ఏఁవిటీ లెక్క అన్నట్టు గుడ్లప్పగించి చూస్తున్నాడు. రెండోవాడు-

"రూపాయికి కానీ వడ్డీ అంటే సంవత్సరానికి నూటికీ ఏడువేలా!" అన్నాడు సుదర్శనం కేసి అసహ్యంగా చూస్తూ.

సుదర్శనంకి అతని బాధ అర్థమయ్యింది. అందుచేత శాంతంగా-

"ఇది గణితం. కావలిస్తే ఆ తరవాత కాగితం మీద వేసి చూడు" అంటూ

"ఇంక వర్తకం. ఇది అచ్చంగా ఇందాక చెప్పిన పద్ధతిలో జరిగే దోపిడీ!

నీ వద్ద అప్పు తీసుకున్న రైతు తన పంట నీకే అమ్మాలి. ధర నిర్ణయించేది నువ్వు. లేదా నీసాటి వాడే ఇంకొకడు. కొలిచేది నీ కుంచంతో. బజారు కుంచం నాలుగడ్డలైతే నీ కుంచం ఐదు అడ్డలు. పైగా కొలతలో చెక్కుపట్టు.

నీ అప్పుకి సరిపడా ఐదు వందల ఇరవై ఐదు రూపాయల సరుకు నువ్వు తీసుకుంటే, రైతు నీకిస్తున్నది ఆరు వందల ఇరవై అయిదు రూపాయల సరుకు. ధర నిర్ణయంలో లాభం, చెక్కుపట్టులో లాభం కలిపితే ఎంత లేదన్నా రెండు వందలు ఔతుంది. ఇందాక వడ్డీతో కలిపితే మూడు వందలు.

ఆవిధంగా ఏడాదిలో ఐదు వందలు అప్పు తీసుకున్న రైతు వల్ల సునాయాసంగా నీకు మూడు వందలు లాభం. అంటే అతడికి నష్టం మూడు వందలు".

సుదర్శనం లెఖ్ఖలైతే చెప్పేడు కాని ఆ లెఖ్ఖలు ఎవరికి చెప్పేడే ఆ మనిషి వంక తల ఎత్తి చూడలేదు. ఆ సూరప్పడితో సహా అందరూ దెయ్యం కొట్టినట్టు చూస్తూ ఉండిపోయారు.

ఇందాకటి షాహుకారు బిడ్డే ముందుగా తేరుకొని-

"ఎలాగైతేనేం గాని మా గొప్పలెక్కలు చెప్పేడు పంతులు.

నిజంగా అంతంత లాభాలేవస్తే యీపాటికి యీ వూళ్ళో షాహుకార్లందరూ బంగారం మేడలు కట్టింతురు". అన్నాడు పుంజుకుంటున్న కోపంతో.

సుదర్శనం ఊరుకోవలసింది – కాని ఊరుకోలేకపోయాడు.

"నేనిందాకే చెప్పాను. నిజం తెలుసుకోవాలని కోరిక వుంటేనే వినగల ధైర్యం ఉంటేనే అడగమన్నాను. ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఈ ఊళ్ళో ఏ షాహుకారివైనా చిఠా ఆవర్జాలు తీసుకు రావచ్చు. నేనన్న ప్రతి మాటకూ రుజువు చూపిస్తాను" అన్నాడు శాంతంగానే.

అది వినగానే రెండో షాహుకారి బిడ్డ సర్రున లేచిపోయాడు.

"ఏటయ్యా నీ నిజం – ఏటి నీ నిజం? నూటికి ఏడు వేల రూపాయల వడ్డీ రేటు నిజమా? ఎవడేనా వీధిని పోయేవాడిని పిలిచి చెప్పు. నోటితో కాదు నవ్వడం. దేనితోనో నవ్వుతాడు. ఈపాటి నిజాలకి పెద్ద సవాలొకటి! మా చిఠా ఆవర్జాలు తెమ్మనడానికి నువ్వెవడివి? కాదు – నువ్వెవడివి అంటాను!..." మాట మాటకు రెచ్చిపోతున్నాడు షాహుకారు బిడ్డ.

ఇంక తను ఓర్చి లాభం లేదనుకున్నాడు సుదర్శనం లేచి నిలబడి–

"ఇదిగో– నువ్వు నోరు పారేసుకోకు. నీతో నేను మాటాడలేదు". తీవ్రంగా అతడి కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"మరెవరితో మాట్లాడావు? ఇంతసేపూ ఎవరితో మాటాడావు?"

"ఆయనతో మాటాడుతున్నాను. సూరప్పడితో మాటాడుతున్నాను. ఆస్తి ఎలా వచ్చిందో ఆయన చెప్పమన్నాడు. ఆయన చెప్పమంటేనే ఆ లెక్కలు ఆయనకు చెప్పాను".

"అయితే? ఆయన ఊరివాళ్ళ సొమ్ము ఉబ్బరగా పడేసుకున్నాడంటావా! ఆయనగాని యింకో షాహుకారు గాని రైతుల దగ్గరకెళ్ళి నాయన్నాయనా బాబ్బాబూ మా దగ్గిర అప్పులు తీసుకోండని బతిమాల్తున్నారా? వద్దంటే బలిమిని కట్టబెట్టారా? అవసరానికి ఆళ్ళే వచ్చి కాళ్ళావేళ్ళా పడి అడిగితే తన దగ్గిరున్నదో ఒక్కాడ తెచ్చిందో ఇచ్చి సాయం చేస్తారు. చేసినందుకు లోక రివాజు ఎలా ఉంటే అలా వడ్డీ తీసుకుంటారు. నువ్వయితే మాత్రం వూరికినే అప్పిస్తావా?"

రెండో షాహుకారు బిడ్డ మధ్యలోనే అందుకున్నాడు.

"కాదు. ఆయన గొప్ప లోకోద్ధారకుడు! అందుకే ఆళ్ళ నాన్నగారు ఎనమల అప్పలస్వామికి ఎనిమిదొందలు అప్పిచ్చి మూడు వేల రూపాయల పొలం రెండు వేలకు కట్టుకున్నారు!"

ఇలా వాళ్ళిద్దరూ రేచుకుక్కల్లా సుదర్శనం మీద పడిపోతుంటే ఆసరికే బుచ్చిలింగం నారాయణయ్య వాళ్ళ మధ్యకి జొరబడిపోయి వాళ్ళను శాంతించమంటూ నచ్చ చెపుతున్నారు. బైరాగి సుదర్శనం రెండు జబ్బలూ పట్టుకొని అతడి స్థలంలో కూర్చుండబెడుతూ తగ్గు తగ్గు అని తగ్గమంటున్నాడు.

సుదర్శనం కూర్చుంటూ షాహుకారి బిడ్డ ఆఖరి విసురికి జవాబిస్తున్నాడు.

"నేను ఇందాకే చెప్పాను – తప్పు ఎవరు చేసినా తప్పే అని. నేనో నా వాళ్ళో చేసేది ఏదైనా రైటే అనే ఉద్దేశం – నాకు లేదు" అన్నాడు విసురుగా.

"మరెవరికుందీ?" అన్నాడు షాహుకారు బిడ్డ – పెడముఖంగా.

"ఇంతసేపూ నాతో వాదించిన వాళ్ళందరికీ ఉంది" – సుదర్శనం.

బుచ్చిలింగం నారాయణయ్యా మళ్ళా కూకలేస్తే అప్పటికా వాదం ఆగిపోయింది.

ఇంతలో సూరప్పడు–

"అయితే పంతులూ ఆళ్ళ మాటకేం గాని నాకు చెపుదూ" అన్నాడు తల తాటించుకుంటూ.

సుదర్శనం సావధానుడయ్యాడు.

"భగవంతుడు నాకిచ్చిన సంపదంతా అన్యాయార్జితమే నంటావా?" అన్నాడు సుదర్శనం కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

సుదర్శనం గమనించలేదు గాని – సూరప్పడి ముఖం మీద అంతకు ముందల్లా వెలిగిన చిరునవ్వు ఆ సమయానికి అంతరించి పోయింది. అది గమనించి–

"ఇంక ఊరుకో బావా! ఏదో కుర్రాయన!" అన్నాడు బుచ్చిలింగం.

"కాదు కాదు చెప్పనీ. చిన్నవాడైనా పెద్దవాడైనా నిజం చెప్పినప్పుడు వినాల" సూరప్పడు మళ్ళా తల ఊపుతూ అన్నాడు.

సుదర్శనం జంకలేదు.

"మీకే కాదు. ఆస్తంటూ ఎవరి దగ్గరకు ఏ మేరకి చేరినా అది అన్యాయార్జితమే. న్యాయంగా సంపాదించిన డబ్బు మనిషి భుక్తికి మాత్రమే సరిపోతుంది. కడుపుకి లేని పేదవారు యీ లోకంలో ఉన్నంత కాలం అంతకు మించి చేసిన ఆర్జనంతా అన్యాయార్జితమే.

ఎవడి పొట్టో కొట్టందే మన పొట్టకు మించిన తిండి మన యింట్లో మిగలదు పదిమంది ఆస్తి చెదిరితే గాని ఒకడి ఆస్తి పెరగదు.

నా ఎరికని యీ ఊళ్ళో ఎందరెందరో రైతులు వ్యవసాయ కూలీలయ్యారు. బుచ్చిలింగం లాంటి చిన్న చిన్న సంసారులెందరో అప్పులు చేసి ఆస్తులమ్ము కున్నారు. ఈ

భూములూ, ఆస్తులూ అన్నీ ఎవరికి దఖలు పడ్డాయి? ఎలా దఖలుపడ్డాయి? శ్రమించి చెమటోడ్చడం వల్లా? శ్రమించి చెమటోడ్చిన వాడు ఒక్కడైనా సెంటుభూమి కొనగలిగాడా?" సుదర్శనం ప్రశ్నించి ఆగాడు.

సుదర్శనం ఎంతో జాగ్రత్తగా మాటాడేడు. నిజం వెల్లడించడమే అతని అభిమతంగాని నిష్ఠురం వెయ్యడం అతని ఉద్దేశం కాదు. అయితే నిజం నిష్ఠురమైనది అంటారు పెద్దలు. అందుచేత–

"అంటే బుచ్చిలింగం భూములు నేనన్యాయంగా తీసుకున్నానంటావా?" అన్నాడు సూరప్పుడు.

"అలా అని నేననలేదు. ఇప్పుడడిగారు కాబట్టి చెపుతున్నాను. వడ్డీ విలువకు మీరు తీసుకున్న భూముల్లో నూటికి డెబ్భై పాళ్ళు అన్యాయమే!"

అంతే. సూరప్పుడు వెంటనే లేచి ఆ మెట్లు ముందే మోకరిల్లి దేవుడికి దండం పెట్టి, లేచి నిటారుగా నిలుచుని రెండు చేతులూ నెత్తి మీదకి చేర్చి నమస్కరిస్తూ వణికే కంఠంతో పాటు ఆపాదమస్తకం వణికిపోతూ–

"హే నారాయణమూర్తీ మహాప్రభో! నువ్వే సాక్షివి. నేను, బుచ్చిలింగం దగ్గర్నుండికాని, ఇంకే మనిషి దగ్గర్నుండైనా కాని, నాది కానిది, ఒక దమ్మిడి ఐనా, నేనన్యాయంగా తీసుకుంటే, ఆ పాప ఫలం నెల తిరగకుండా, నేననుభవించాలి. లేదు నన్నన్యాయంగా ఎవరైనా ఆడిపోసుకుంటే –" అంటూ అర్ధాంతరంలో ఆగిపోయి, క్షణకాలంతో ఆవేశాన్ని నిగ్రహించుకొని–

"కాదు. తప్పు తప్పు" అని గొణుక్కుంటూ నాలుగైదుసార్లు లెంపలు వేసుకున్నాడు.

తరవాత పూజా ద్రవ్యాలతోడి పళ్ళెం తీసుకొని, తిన్నగా గర్భగుడి ద్వారం దగ్గరకి వెళ్ళి, పళ్ళెరం అక్కడ ఉంచేసి వెనక్కి తిరిగి, ఎదురైన బుచ్చిలింగంతో–

"బావా! బాబొస్తే నేను వచ్చి వెళ్ళానని చెప్పు. భోగం గంట కొట్టగానే వచ్చి దర్శనం చేసుకుంటానని చెప్పు" అంటూ కదిలిపోబోయాడు.

బుచ్చిలింగం అడ్డుగా నిలబడి–

"బావా! తప్పు. నువ్వు పెద్దవాడివి. ఆయన కుర్రాడు. తెలిసిన గోలా కాదు, తెలియని గోలా కాదు..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"అబ్బే... అబ్బే... నాకేం కోపం లేదు. ఒక్కక్షణం బాధేసింది. మనిషిని కదా ఒక్కక్షణం బాధేసింది. అంతే" అంటూ నవ్వడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ తల చాటించుకుంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

బుచ్చిలింగం గుడిలోంచి బయటికి వచ్చేసరికి కొయ్యబొమ్మలా సావిడి రాటకు చారబడిపోయిన సుదర్శనం కనిపించాడు. అతడి స్థితి చూస్తే షాహుకారి బిడ్డలకు కూడా నోరొచ్చినట్టు లేదు. కొంతసేపు అందరూ అలాగే ఉండిపోయాక బైరాగి గభాలున లేచిపోయి సుదర్శనాన్ని రెక్కపట్టుక లేవనెత్తుతూ–

"మాంచి పంతులువే! ఇంతమందినీ ఇంతసేపూ హడలుగొట్టి ముసిలోడి దెబ్బకి మూర్ఛపోతావా? పద పద నేనూ మీ యింటి కాసే రావాల" అంటూ తనతో తీసుకుపోయాడు

★ ★ ★

జరిగిన సంగతి విని తల్లిదండ్రులు సుదర్శనాన్ని మందలించారు. నాలుగైదు రోజులు అతడు వీధి ముఖం చూడలేదు. ఈలోగా చెప్పుకొని చెప్పుకొని ఊళ్ళో వాళ్ళు కూడా మరిచిపోయారు.

కానీ పదిహేను రోజుల తరవాత సూరప్పుడి ఏకపుత్రుడుకి కాళ్ళూ చేతులూ పడిపోయాయన్నారు. నాలుగైదు రోజులు జ్వరం కాసి తగ్గాక ఏదో అపథ్యం జరిగిందన్నాడు వైద్యుడు. దానితో పూరూ వాడా ఒక్కసారి గుప్పుమంది.

సూరప్పుడి ఇంట్లో అతని చుట్టపక్కాలూ ఆశ్రితులూ అటు సూరప్పణ్ణి ఇటు సుదర్శనాన్నీ ఇద్దర్నీ ఆడిపోసుకున్నారట. సూరప్పుడి వియ్యపురాలూ అతడి భార్యా అయితే సుదర్శనాన్ని తిట్టని తిట్టులేదట. ఈ విషయం తెలిసి సుదర్శనం తల్లి చేసిన గొడవనంతట్నీ సుదర్శనం మౌనంగా భరించాడు.

ఆనాటి చిత్తక్షోభలో అతడి మూల మూలల విశ్వాసాలు కదిలిపోయాయి. ఆ రాత్రి అతడికి ఎంతకూ నిద్రపట్టలేదు. అర్ధరాత్రి దాటుతూ ఉంటే వెల్లకిలా పడుకున్న వాడు మంచం మీద లేచి కూర్చోని చేతులు రెండూ ఒడిలో ఒకదానిపై ఒకటి ఉంచి క్రైస్తవులు ప్రార్థన చేసే ధోరణిలో ఒక్కొక్క మాటే అనుకోసాగాడు. అతని చుట్టూ చిమ్మచీకటి.

"మహేశా నువ్వు నిగ్రహానుగ్రహాలకు అతీతుడవని నా నమ్మిక. కాని అపవాదభీతి నన్ను సంశయాత్ముణ్ణి చేస్తోంది. ఒకవేళ తక్కిన వారందరూ నమ్మేటట్టు నువ్వు ప్రార్థనలకు కరిగి మా కోర్కెలు తీర్చేవాడివే అయితే నా జన్మానికి తొలిసారిగా, తుదిసారిగా కూడా ఒకే ఒక్క కోరిక కోరుతాను. సూరప్పుడి ఏకపుత్రుణ్ణి బ్రతికించు".

ఇలా చెప్పుకొని, ఆత్మ సంస్కృతి చేసే అవహేళనను మూగగా భరిస్తూ నిద్రపోవటానికి ఎంతసేపో వ్యర్థ ప్రయత్నాలు చేశాడు.

లోకాపవాద భీతిలో కొందరు ప్రాణాలనే త్యాగం చేస్తారు. సుదర్శనం విశ్వాసత్యాగం చేయడం వింత కాదు. అయితే యింతచేసినా అతనికి మాట దక్కలేదు.

సూరప్పుడు పెట్టిన గడువు తప్పకుండా చచ్చిపోతాడనుకున్న అతడి కొడుకు లేచి కూర్చున్నాడు.

అతడికి ఆరోగ్య స్నానం చేయించిన నాటి సాయంత్రమే సుదర్శనం పరీక్షా ఫలితాలు తెలిశాయి. అతడిపరీక్ష పోయింది.

"మరేం అవుతుందయ్యా! అన్యాయంగా ఒకరిని ఆడిపోసుకున్నా ఒకడికి ఉందని చెప్పి ఏడుచుకున్నా మనిషి జయం పొందదు. ఈ పంతులు పదేళ్ళయో పన్నెండేళ్ళయో పట్నంలో చదువుతున్నాడు. ఎప్పుడేనా పరీక్ష పోవడం ఎరుగునా? మరి ఇప్పుడే పోవడమేమిటీ? అదీ – సూరప్పడి కొడుకు ఆరోగ్య స్నానం చేసిన్నాడే తెలియదమేమిటీ?" అనుకున్నారు జనం.

ఇది విన్న సుదర్శనానికి కలిగిన బాధముందు పరీక్ష పోయినందుకు కలిగిన బాధ ఒక బాధ కాదు.

★ ★ ★

ఇది జరిగి ఎంతో కాలం కాలేదు. అప్పుడప్పుడూ సుదర్శనానికి యీ దుర్ఘటన జ్ఞాపకం వస్తుంది. అందులో రెండు దృశ్యాలని అతడెప్పటికీ మరిచిపోలేడు.

ఆ అర్ధరాత్రి అతడు మంచం మీద నిశ్చలంగా కూర్చుని పరమేశ్వరుని గూర్చి ప్రార్ధన చేసేది మొదటి దృశ్యం. ఆలయం మెట్లముందు నించొని రెండు చేతులూ నెత్తిన ఉంచుకున్న సూరన్న జగన్నాధుని సాక్షిగా ఒట్టుపెట్టడం రెండవది.

మొదటిది జ్ఞాపకం వచ్చినప్పుడు తన సిగ్గుమాలిన పనికి సాక్ష్యం లేనందుకు సంతోషిస్తాడు. ఆ తరువాత అందుకు కూడా సిగ్గుపడతాడు.

రెండోది జ్ఞాపకం వచ్చినప్పుడు మాత్రం అతడు దరీదాపూ లేని ఆలోచనా సముద్రంలో పడతాడు.

లోకంలో – ఇతరులకు గాని తమకుగాని జరుగుతున్న అన్యాయమేమిటో తెలియనప్పుడు, మనుష్యులు తప్పులు చేయవచ్చు. తప్పుగా ఆలోచించవచ్చు. తప్పుగా అర్థం చేసుకోవచ్చు.

విషయం యిది అని తెలిసిన వాళ్ళు విపులంగా చెప్పాకనైనా నిజాన్ని ఏల చూడరు? ఏల గ్రహించరు?

శ్రమ దోపిడీని గురించి తను చెప్పిన విషయాలు అనుభవం తమది కాదు. కాబట్టి వాళ్ళకు అర్థం కాకపోవచ్చు. షాహుకార్ల చేతిలో రైతులకు జరిగే అన్యాయాన్ని వివరించినప్పుడు వాళ్ళు రైతులయ్యుండీ వాళ్ళకు జరిగే అన్యాయాలనైనా వాళ్ళు ఏల చూడలేకపోయారు?

అలాగే ఆనాటి సూరప్పడి చర్య కూడా అతనికి అర్థమయ్యేది కాదు.

తనకైతే భగవంతుని నిగ్రహానుగ్రహాల పట్ల విశ్వాసం లేదు. కాని సూరప్పడు భగవంతుడి పట్ల విశ్వాసమున్న వాడు. భగవద్భీతి కలవాడు. అలాంటివాడు అంకెలతో సహా అతనివల్ల జరుగుతున్న అన్యాయాన్ని అంత స్పష్టంగా వివరించాక కూడా భగవంతుణ్ణి పిలిచి తన విత్తం పాపార్జితమైతే తన్ను శిక్షించమని ఎలా అనగలిగాడు?

ఎంత ఆలోచించినా యీ రెండు ప్రశ్నలకూ అతడికి జవాబులు తెలిసేవి కావు.

సుదర్శనం పాక్షిక దృష్టిని విడనాడి తన అవగాహనను మరింత పెంచుకొని ఉంటే జవాబులు అంత కష్టమై ఉండేవి కావు.

అవగాహన వేరు. అవగాహన మేరకు జీవించడం వేరు. కాగా తనకున్న శక్తి సామర్థ్యాలు ప్రతివారికీ ఉంటాయనీ, అందరి స్వభావాలూ ఒక్కలానే ఉంటాయనీ అనుకోవడం కూడా సుదర్శనం పొరపాటే.

ఇంక సూరప్పడి గురించి–

సూరప్పడి గురించి అన్ని విషయాలూ సుదర్శనంకు తెలియవు. అతడి ఆస్తి సుదర్శనం అనుకున్నట్టు ఒక లక్షకాదు. రెండు లక్షల ఇరవై వేలు.

అయితే యీ ఆస్తిలో ఒక్కపైసైనా అతడు ప్రయత్నించి సంపాదించ లేదు. తండ్రి చూపి విడిచిన వృత్తి తండ్రి యిచ్చిన పెట్టుబడితో ఆరంభించాడు. అతడికి అక్షరజ్ఞానం లేదు. అక్షరాల వ్యవహారమంతా గుమస్తా చూసేవాడు. డబ్బు ఇచ్చి పుచ్చుకోడాలు తను చేసేవాడు.

లెక్కల్లోగాని వ్యవహారాలలో గాని మాట తభావతు రానిచ్చేవాడు కాదు. ఆ విషయంలో గుమస్తాని అడుగడుగునా హెచ్చరించే వాడు. అతని జ్ఞాపకశక్తి అమోఘం. తనకు రావలసేది ఎంత నిక్కచ్చిగా రాబట్టుకునే వాడో, ఇవ్వవలసే చోట అంత నిక్కచ్చిగానూ చెల్లించేవాడు.

వ్యాపార విషయాలలో అతని నిక్కచ్చితనం ఖాతాదార్లలో అతనిపట్ల గౌరవాన్ని పెంచేవి. కాలం గడుస్తున్న కొద్దీ వ్యాపారం పెరిగింది.

ఒక్కమాటలో చెప్పాలంటే అతను దోపిడీ చెయ్యలేదు. అతనివల్ల దోపిడీ జరిగింది. ఫలితం భౌతికంగా ఒకటే అయినా నైతికంగా రెంటికీ తేడా ఉంది.

సుదర్శనం ఈ విషయం గుర్తించలేదు.

అతడు తన ప్రతివాదులకు వివరింపదలచిన విషయం వారి పాలిట ఎలాంటి అజ్ఞేయాంశమో సుదర్శనం పాక్షిక బుద్ధికి పై చెప్పిన విషయం అలాంటి అప్రజ్ఞాతం. ★

(జయభారత్, నవంబరు 1951)